1 St Year
Happy Work Anniversary.

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 2 సంచిక : 185 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శుక్రవారం 30 మే 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 185 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Friday 30 May 2025 PAGES : 8 PRICE : 3/-




# ఆర్థిక ఉగ్రవాదుల పై ఆపరేషన్ క్లీన్ పాలిటిక్స్‌కు శ్రీకారం

**కడపలో ముగిసిన టీడీపీ మహానాడు ముగింపు సభలో సిఎం చంద్రబాబునాయుడు**
**కడప మహానాడు వేదికగా గత ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు**
**రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పునరుద్ఘాటన**
**టీడీపీ కార్యకర్తల త్యాగాలతోనే ప్రజాపాలన సాధ్యమైందని వ్యాఖ్య**

**(షణ్ముఖ వెలుగు బ్యూరో, అమరావతి, మే 29)**

పాకిస్థాన్ ఉగ్రవాదులను ఏరిపారేసిన 'ఆపరేషన్ సింధూర్' తరహాలో రాష్ట్రంలో 'ఆపరేషన్ క్లీన్ పాలిటిక్స్' చేపట్టి, ఆర్థిక ఉగ్రవాదులను రాజకీయాల నుంచి తరిమికొట్టాలని ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పిలుపునిచ్చారు. ఉగ్రవాదులు దేశానికి ఎంత ప్రమాదకరమో, రాజకీయ ముసుగులో ఉన్న ఆర్థిక నేరగాళ్లు సమాజానికి అంతకంటే ఎక్కువ హానికరమని ఆయన అన్నారు. కడప శివార్లలో గురువారం జరిగిన మహానాడు మూడో రోజు బహిరంగ సభలో ఆయన పార్టీ శ్రేణులను, ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. గత ప్రభుత్వ హయాంలో ల్యాండ్, శాండ్, వైన్, మైన్ కుంభకోణాలతో రాష్ట్రాన్ని దోచుకున్నారని చంద్రబాబు ఆరోపించారు. ప్రజలు నమ్మి ఓటేస్తే జె బ్రాండ్ల మద్యం, గంజాయి, డ్రగ్స్‌తో వారి ఆరోగ్యాలను నాశనం చేశారని విమర్శించారు. అడవులను ఆక్రమించి ఎస్టేట్‌లు -మిగతా 2లో

## మా సైన్యం మేల్కొనేలోపే భారత్ దాడి చేసింది



**(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 29)**

ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్, పీవోకేలో దాడులు చేసిన భారత సైన్యం.. అనేక ఉగ్ర, సైనిక స్థావరాలను ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. ఈ దాడులు జరిగిన విషయాన్ని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అంగీకరించారు. పాక్ సైన్యం మేల్కొనేలోపే కీలక సైనిక స్థావరాలే లక్ష్యంగా బ్రహ్మోస్ క్షిపణులతో -మిగతా 2లో

## మెకానికల్ ఇంజినీర్ టు ఆధ్యాత్మిక గురువు.. ఎవరీ జోనాస్ మాసెట్టి?



**(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 29)**

ధోతీ.. మెడలో రుద్రాక్ష మాల.. కాలికి చెప్పుల్లేకుండా నడి వయసు ఉన్న ఓ వ్యక్తి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా తాజాగా పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. ఆయన పేరు ఆచార్య విశ్వనాథ్. ఇందులో విషయం ఏముంది అనుకుంటున్నారా? ఆయన అసలు పేరు జొనాస్ మాసెట్టి. బ్రెజిల్‌కు చెందిన వ్యక్తి. వేదాలు, -మిగతా 2లో

## మన జెండా పీకేస్తాం అన్నోళ్లు అడ్రస్ లేకుండా పోయారు

**మహానాడు చివరి రోజు బహిరంగ సభలో మంత్రి నారా లోకేశ్**
**వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని విధాలా నష్టపోయిందని తీవ్ర విమర్శలు**
**సీబీఎన్ ఒక బ్రాండ్ అని, అభివృద్ధి, సంక్షేమం ఆయనతోనే సాధ్యమని వెల్లడి**
**ప్రభుత్వ కొనసాగింపుతోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమని స్పష్టం**

**(షణ్ముఖ వెలుగు బ్యూరో, అమరావతి, మే 29)**

తెలుగుదేశం పార్టీ జెండా పీకేస్తామని, పార్టీని లేకుండా చేస్తామని అన్నవారు ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తీవ్రస్థాయిలో విమర్శించారు. కడపలో జరిగిన మహానాడు వేదికగా ఆయన మాట్లాడుతూ, వై నాట్ 175 అన్నవారికి ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఎదుర్కొన్న సవాళ్లను, కార్యకర్తల త్యాగాలను స్మరించుకుంటూ, రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రగతికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.



**మాస్ జాతర అదిరిపోయింది!**

తిరుమల తొలిగడప దేవుని కడప... ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయం, అమీన్ పీర్ దర్గా, మరియాపురం చర్చి నెలకొన్న పుణ్యభూమి కడప. పౌరుషం, ఆత్మీయతలను కలగలిపి మహిళలను గౌరవించి గొప్పనేల కడప. కడప మాస్ జాతర మహానాడు అదిరిపోయింది. పౌరుషాల గడ్డపై పసుపు సైన్యం గర్జించింది, దేవుని గడప కడపలో పసుపు పండగ జరుపుకోవడం మన అదృష్టం. 2024లో మాస్ విక్టరీ సాధించాం, రికార్డులు బద్దలు కొట్టాం... చరిత్రను తిరగరాసాం. 94 పర్సెంట్ స్ట్రైక్ రేట్...164 అవుటాఫ్ 175. ఇది కేవలం రికార్డ్ కాదు ఆల్ టైం రికార్డ్. ఇది తెలుగుదేశం పార్టీ కార్యకర్తల నాటుదెబ్బ. జెండా పీకేస్తాం అన్నారు ... పార్టీ కార్యాలయానికి టు లెట్ బోర్డు పెట్టుకున్నారు. పార్టీ లేకుండా చేస్తామన్నోళ్లు అడ్రెస్స్ లేకుండా పోయారు. వై నాట్ 175 అన్నారు ... ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదు. మన బొమ్మలు పెట్టి బాక్సింగ్ చేసారు... ఎన్నికల్లో ప్రజలు ఫుట్ బాల్ ఆడుకున్నారు. ఏ తప్పు చేయని మన అధినేతను అరెస్ట్ చేసారు... ప్రజలు వాళ్ళ నాయకుడిని ప్యాలస్ లో పెట్టి తాళం వేసారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గారికి, గౌరవ మంత్రులు, గౌరవ ఎమ్మెల్యేలు, 82 బ్యాచ్ సీనియర్ నాయకుల దగ్గర నుండి 2025 బ్యాచ్ జూనియర్లకు, ప్రజలకు, అందరి కంటే ముఖ్యం, ఎత్తిన జెండా దించకుండా, మడమ తిప్పకుండా తెలుగుదేశం పార్టీకి కాపలా కాస్తున్నప్రాణసమానమైన కార్యకర్తలకు నా శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. -మిగతా 2లో



## పీవోకే ప్రజలు మనవాళ్లే.. గ్రేట్ ఇండియా మా సంకల్పం

**(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 29)**

పీవోకే ప్రజలు మన వాళ్లేనని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. అక్కడున్న వారికి భారత్‌తో దృఢమైన సంబంధాలున్నాయని అన్నారు. ఈమేరకు దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. "భౌగోళికంగా విడిపోయినా పీవోకే ప్రజలు రాజకీయంగా ఏదో ఒకరోజు భారత్‌లో ఏకమవుతారు. ఆ రోజు ఎంతో దూరంలో లేదు. పీవోకే దానంతట అదే తిరిగి వస్తుంది. అక్కడున్నవారికి భారత్‌తో దృఢమైన సంబంధాలున్నాయి. గ్రేట్ ఇండియా మా సంకల్పం. అక్కడ కొందరు మాత్రమే తప్పుదారి పట్టారు.



మనం ఏమైనా చేయగలిగేవాళ్లం. అయితే శక్తితో పాటు సంయమనం కూడా ముఖ్యం. ఆపరేషన్ సిందూర్ ద్వారా దేశభద్రతకు మేకిన్ ఇండియా ముఖ్యమని ప్రూవ్ అయింది. మనం ఇప్పుడు ఫైటర్ జెట్లు, క్షిపణి వ్యవస్థలను నిర్మించడంతో పాటు.. కొత్తతరం యుద్ధ సాంకేతికతల పైనా దృష్టిపెట్టాం" అని మంత్రి వెల్లడించారు.

"ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉపయోగించిన దేశీయంగా అభివృద్ధి చెందిన వ్యవస్థలు ప్రపంచం మొత్తాన్ని షాక్‌కు గురిచేశాయి. శత్రుకవచాన్ని దాటుకొని వెళ్లగలమని నిరూపించాం. ఉగ్రస్థావరాలు, తర్వాత శుత్రువుకు చెందిన మిలిటరీ స్థావరాలను ఎలా ధ్వంసం చేశామో మీరు చూశారు. ఇంకా చాలా చేయగలం. బలం, నిగ్రహం మధ్య సమన్వయాన్ని ప్రపంచానికి చూపాం" అని చెప్పారు. ఈసందర్భంగా పాకిస్థాన్‌పై విరుచుకుపడ్డారు. ఉగ్రవాద వ్యాపారాన్ని నడపడానికి పెద్ద ఖర్చేం కాదు కానీ, దానివల్ల భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. అదే ఇప్పుడు పాక్‌కు అర్థమైందన్నారు.

పాకిస్థాన్ ఎన్నోఏళ్లుగా పెంచి.. పోషిస్తున్న ఉగ్రవాదాన్ని భారత సైన్యం కేవలం 23 నిమిషాల్లో తుడిచిపెట్టేసిందని ఇటీవల రాజ్‌నాథ్ సింగ్ ) పేర్కొన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం -మిగతా 2లో

మొదటి పేజీ తరువాయి

# ఆర్థిక ఉగ్రవాదుల పై ఆపరేషన్ క్లీన్ పాలిటిక్స్‌కు శ్రీకారం

నిర్మించుకున్నారని, కొండలు, చెరువులను కూడా కబ్జా చేశారని మండిపడ్డారు. ప్యాలెస్‌ల నుంచి ఎస్టేట్‌ల వరకు అక్రమ సామ్రాజ్యాన్ని నిర్మించుకున్న వైకాపాకు ప్రజలు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారని అన్నారు. పార్టీ ఎలా ఉండాలో, పాలన ఎలా సాగాలో చెప్పడానికి టీడీపీ ఒక కేస్ స్టడీ అయితే, పాలకులు ఎలా ఉండకూడదో, పార్టీ ఎలా నడపకూడదో చెప్పడానికి వైకాపా మరో కేస్ స్టడీ అని ఆయన వ్యాఖ్యానించారు.

**మహానాడుకు అపూర్వ స్పందన**

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేవుని గడప అయిన కడపలో జరిగిన తొలి మహానాడుకు అద్భుత స్పందన లభించిందని, ఇది సూపర్ హిట్ అయిందని చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. గత ఏడాది మే 2న ప్రజాగళం సభలో "కడప రాజకీయం మారుతోంది" అన్న తన మాట అక్షరాలా నిజమైందని గుర్తుచేశారు. ఉమ్మడి కడప జిల్లాలో 10 స్థానాలకుగాను 7 సీట్లు కూటమి గెలుచుకుందని, వచ్చే ఎన్నికల్లో 10కి 10 సీట్లు గెలవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాయలసీమ ప్రజలు ఈ ఎన్నికల్లో 52 స్థానాలకు 45 స్థానాల్లో కూటమిని గెలిపించి అద్భుత తీర్పు ఇచ్చారని, ఇది తమపై మరింత బాధ్యతను పెంచిందని అన్నారు. గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని విధాలా ధ్వంసమైందని, రూ.10 లక్షల కోట్ల అప్పులు, రూ.1.20 లక్షల కోట్ల బకాయిలు మిగిల్చి రాష్ట్రాన్ని 30 ఏళ్ళు వెనక్కి తీసుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, క్లైమోర్ మైన్‌లకే భయపడని తాను ఇలాంటి సమస్యలకు భయపడనని, అనుభవంతో, మనోధైర్యంతో రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నామని తెలిపారు. ఏడాది కాలంలోనే సుపరిపాలన అంటే ఏంటో చూపిస్తూ అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని వివరించారు.

**సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం**

సంపద సృష్టించడం తెలిసిన పార్టీ టీడీపీ అని, సంక్షేమ కార్యక్రమాలకు ఎన్టీఆర్ నాంది పలికారని చంద్రబాబు గుర్తుచేశారు. ఇచ్చిన మాట ప్రకారం వివిధ వర్గాలకు రూ.4 వేల నుంచి రూ.15 వేల వరకు పింఛన్లు అందిస్తున్నామని, దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా 64 లక్షల మందికి ఏటా రూ.33,000 కోట్లు పింఛన్లకే ఖర్చు చేస్తున్నామని తెలిపారు. 16,347 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి తొలి సంతకం హామీని నిలబెట్టుకున్నామన్నారు. 'దీపం-2' కింద ఏటా 3 సిలిండర్లు ఉచితంగా అందిస్తామని, ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. వందల కోట్లతో రోడ్ల మరమ్మతులు చేపట్టామని, 203 అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించామని, 21 దేవాలయాల్లో నిత్యాన్నదానం మొదలుపెట్టామని తెలిపారు. గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన 94 కేంద్ర ప్రాయోజిత పథకాల్లో 73 పథకాలను పునరుద్ధరించామని వివరించారు. తెలుగుదేశం పార్టీ బీసీల పార్టీ అని, వారి అభ్యున్నతికి ఎప్పుడూ పెద్దపీట వేస్తామని చంద్రబాబు అన్నారు. బడ్జెట్‌లో బీసీలకు రూ.47,456 కోట్లు కేటాయించామని, నాయీ బ్రాహ్మణుల వేతనాలు రూ.25 వేలకు పెంచామని, చేనేతలకు జీఎస్టీ రద్దు చేశామని, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్లు, చేనేతలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. గీత కార్మికులకు మద్యం షాపుల్లో 10% కేటాయింపు, మత్స్యకారులకు 'మత్స్యకార భరోసా' కింద రూ.20 వేల ఆర్థిక సాయం వంటి పలు కార్యక్రమాలను వివరించారు.

**యువత, రాయలసీమ అభివృద్ధికి పెద్దపీట**

యువత భవిష్యత్తు కోసమే తాను పనిచేస్తున్నానని, 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పెట్టుబడులు ఆకర్షిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. నూతన పారిశ్రామిక విధానాలతో రాష్ట్రానికి రూ.4.95 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయని, దేశీయ పెట్టుబడుల్లో అగ్రస్థానంలో, వృద్ధిరేటులో రెండో స్థానానికి చేరుకున్నామని అన్నారు. రాయలసీమను రాళ్ల సీమగా కాకుండా రాష్ట్రానికి మణిహారంగా తీర్చిదిద్దుతామని, ఇక్కడ ఫ్యాక్షన్‌కు తావులేకుండా అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. జూన్ 12 లోగా కడపలో స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభిస్తామని, రెండు దశల్లో రూ.9,000 కోట్లతో నిర్మించి 6 వేల మందికి ఉపాధి కల్పిస్తామని ప్రకటించారు. సీమలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరందిస్తామని, గాలేరు-నగరి పనులకు రూ.1,000 కోట్లు తక్షణం విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మహానాడులో తీర్మానించిన 6 శాసనాలతో నూతనత్వాన్ని, కొత్త నాయకత్వాన్ని తీసుకొస్తామని, 2029 నాటికి పేదరికం లేని సమాజమే లక్ష్యమని చంద్రబాబు ఉద్ఘాటించారు. ప్రస్తుతం రాష్ట్ర తలసరి ఆదాయం రూ.2 లక్షల 67 వేలు కాగా, వచ్చే 22 ఏళ్లలో దానిని రూ.55 లక్షలకు పెంచే బాధ్యత తనదని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా, కోడూరు నుంచి సైకిల్‌పై మహానాడుకు వచ్చిన కార్యకర్తను సీఎం సన్మానించారు. కడప తాగునీటి సమస్య పరిష్కారానికి, బుగ్గవంక చెరువు అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని సభాముఖంగా హామీ ఇచ్చారు.

# పీవోకే ప్రజలు మనవాళ్లే.. గ్రేట్ ఇండియా మా సంకల్పం

పాక్ చర్యలను భారత్ పరిశీలిస్తుందని.. తేడా వస్తే మరింత కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ ఆపరేషన్ సిందూర్‌పై ఈ రోజు ప్రధాని మోదీ కూడా మాట్లాడారు. భారత్‌లో ఉగ్రవాదం వ్యాప్తి చేసేవారికి సరైన సమాధానం ఈ ఆపరేషన్ అని వ్యాఖ్యానించారు. పహల్గాంలో ఉగ్రమూక చేసింది మానవత్వంపై దాడి అని, ఇప్పుడు మనం టెర్రరిజానికి వ్యతిరేకంగా పోరాడేందుకు ఏకమయ్యామన్నారు.

# మా సైన్యం మేల్కొనేలోపే భారత్ దాడి చేసింది

భారత్ మెరుపు దాడులు చేసిందన్నారు. వాస్తవానికి మే 10వ తేదీ తెల్లవారుజామున భారత్‌పై దాడులు చేసేందుకు తమ సైన్యం సిద్ధమైందని, అంతలోపే భారత క్షిపణులు తమ స్థావరాలపై విరుచుకుపడ్డాయన్నారు."భారత్ దాడులను దీటుగా తిప్పికొట్టాలని మే 9వ తేదీ రాత్రి మేం నిర్ణయించుకున్నాం. 10వ తేదీ తెల్లవారుజామున ప్రార్థనలు ముగిసిన వెంటనే.. 4.30 గంటలకు దాడులు చేసేందుకు మా సైన్యం సిద్ధమైంది. కానీ, మా ప్రణాళిక అమలుకు కొన్ని గంటల ముందే బ్రహ్మోస్ క్షిపణులతో భారత్ విరుచుకుపడింది. రావల్పిండి ఎయిర్‌పోర్టు సహా అనేక కీలకప్రాంతాలే లక్ష్యంగా దాడులు చేసింది" అని ప్రధాని షరీఫ్ పేర్కొన్నారు. అజర్‌బైజాన్ పర్యటనలో భాగంగా ఓ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. దాడుల ప్రణాళిక గురించి ఆర్మీ చీఫ్ మునీర్ తనకు ముందస్తుగానే తెలియజేశారని అన్నారు.భారత దూకుడుతత్వం ఘర్షణను మరింత పెంచిందని ప్రధాని షెహబాజ్ షరీఫ్ పేర్కొన్నారు. భారత్ దాడి చేసినప్పుడు దేశాన్ని రక్షించుకోవడం తప్పితే తమకు మరో మార్గం లేదన్నారు. కాల్పుల విరమణకు ఆర్మీ చీఫ్ మునీర్ సలహా ఇచ్చారని, ఈ ఘర్షణ మరింత ముదరకూడదనే ఉద్దే శంతో తాను కూడా అందుకు అంగీకరించానని చెప్పారు. పాక్ సైన్యం హెడ్‌క్వార్టర్ ఉన్న రావల్పిండిలోని నూర్‌ఖాన్, చక్వాల్‌లోని మురీద్, జాంగ్ జిల్లా షోర్కోట్‌లో ఉన్న రఫీకి వైమానిక స్థావరాలతోపాటు ఇతర ప్రావిన్సుల్లో భారత్ దాడులు చేసింది. ఇదిలాఉంటే.. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు ప్రపంచ దేశాల నుంచి మద్దతు కరవైంది. కేవలం తుర్కియే, చైనా, అజర్‌బైజాన్, ఇరాన్‌లు మాత్రమే మద్దతుగా నిలిచాయి. దీంతో విదేశీ బాటపట్టిన పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్.. ఆయా దేశాల మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవలే ఇరాన్ సుప్రీం లీడర్‌తోనూ భేటీ అయ్యారు. ఇక్కడ కూడా భారత్‌పై విషప్రచారాన్ని పాక్ మానకపోవడం గమనార్హం.

# మెకానికల్ ఇంజినీర్ టు ఆధ్యాత్మిక గురువు.. ఎవరీ జొనాస్ మాసెట్టి?

భగవద్గీత, భారతీయ సనాతన ధర్మాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేస్తున్నందుకు గానూ ఈ పౌర పురస్కారంతో భారత ప్రభుత్వం సత్కరించింది. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. భారతీయ సంస్కృతి పట్ల ఆయనకున్న గౌరవాన్ని పలువురు ప్రశంసిస్తున్నారు. దీంతో ఎవరీయన అంటూ ఆరా తీస్తున్నారు. జొనాస్ మాసెట్టి బ్రెజిల్‌కు చెందిన ఒక ఆధ్యాత్మిక గురువు. వేద పండితుడు. జొనాస్ మాసెట్టి బ్రెజిల్‌లోని రియో డి జనీరోలో జన్మించారు. ఆయన మొదట మెకానికల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ పొందారు. పెద్ద పెద్ద కంపెనీల్లో పనిచేశారు. పాశ్చాత్య జీవన విధానం, డబ్బు, స్నేహితులు ఇవేవీ ఆయనకు సంతోషాన్ని ఇవ్వలేదు. దీంతో జీవితానికి అర్థం తెలుసుకోవడానికి తమిళనాడులోని కోయంబత్తూరు చేరుకున్నారు. అక్కడున్న గురువు స్వామి దయానంద సరస్వతి వద్దకు చేరుకుని ఆయన మార్గదర్శనంలో ఆధ్యాత్మిక ప్రయాణాన్ని మొదలుపెట్టారు. భారత దేశ వేద జ్ఞానం, భగవద్గీత బోధనలు ఆయన జీవితాన్ని పూర్తిగా మార్చివేశాయి. అలా జొనాస్ మాసెట్టి కాస్త ఆచార్య విశ్వనాథ్‌గా మారారు.

**బ్రెజిల్ కేంద్రంగా ఆధ్యాత్మిక పాఠాలు**

భారత్ నుంచి తిరిగి బ్రెజిల్ పయనం అయిన ఆచార్య విశ్వనాథ్.. రియో డి జనీరోలో విశ్వ విద్య గురుకులాన్ని స్థాపించారు. కోయంబత్తూరులో తాను నేర్చుకున్న వేద జ్ఞానాన్ని ఉచిత ఆన్‌లైన్ కోర్సులుగా అందించడం మొదలుపెట్టారు. ప్రపంచవ్యాప్తంగా ఏడేళ్లలో 1.5 లక్షల మంది విద్యార్థులకు ఆధ్యాత్మిక పాఠాలు బోధించారు. భారతీయ సంస్కృతిని విస్తృతంగా ప్రచారం చేస్తున్న ఆచార్య విశ్వనాథ్‌ను ప్రధాని మోదీ 2024లో నిర్వహించిన మన్‌కీ బాత్‌లో ప్రస్తావించారు. సాంస్కృతిక వారధి అంటూ కొనియాడారు. గతంలో బ్రెజిల్ పర్యటనకు వెళ్లినప్పుడూ ఆయన్ను వ్యక్తిగతంగా కలిశారు. యోగా, వేదాలపై జొనాస్ పలు పుస్తకాలు కూడా రచించారు. ఈ క్రమంలోనే ఆయనను పద్మశ్రీ పురస్కారంతో భారత ప్రభుత్వం సత్కరించింది. ఈ పురస్కారాన్ని తాను ఊహించలేదని, ఈ అవార్డును గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు ఆచార్య విశ్వనాథ్ పేర్కొన్నారు.

# మన జెండా పీకేస్తాం అన్నోళ్ళు అడ్రస్ లేకుండా పోయారు





**దేవుని గడప సాక్షిగా ప్రజలకు 4 ప్రశ్నలు**

దేవుని గడప సాక్షిగా ఇక్కడి ప్రజలను నాలుగు ప్రశ్నలను అడగాలనుకుంటున్నా.... తల్లిని, చెల్లిని మెడబట్టి బయటకు గెంటిదెవరు? సొంత బాబాయిని గొడ్డలిపోటుతో లేపేసిందెవరు? జె-బ్రాండ్స్‌తో పేదల రక్తం తాగిందెవరు? బల్లకింద రెడ్ బటన్ నొక్కి ప్రజలను బాదిందెవరు?

**సీబీఎన్ అంటే ఒక బ్రాండ్**

తెలుగు వారిని ప్రపంచ పటంలో పెట్టింది మన బ్రాండ్ సీబీఎన్. అప్పుడు ఐటీ... ఇప్పుడు ఏఐ. అప్పుడు హైటెక్ సిటీ... ఇప్పుడు క్వాంటమ్ వ్యాలీ. అప్పుడు సైబరాబాద్... ఇప్పుడు అమరావతి. అప్పుడు రూ.200 పెన్షన్ ను రూ. రెండు వేలు చేసింది మన సీబీఎన్... ఇప్పుడు పెన్షన్ ను రూ.నాలుగు వేలు చేసింది కూడా మన సీబీఎన్. అన్న క్యాంటిన్లు, డ్వాక్రా, దీపం, పేదల చిరునవ్వు మన సీబీఎన్. సీబీఎన్ అంటే డెవెలప్మెంట్, సీబీఎన్ అంటే సంక్షేమం, సీబీఎన్ అంటే మానవత్వం. మన నాయకులు ట్రెండ్ ఫాలో అవ్వరు ట్రెండ్ సెట్ చేస్తారు. సినిమా స్క్రీన్ అయినా పొలిటికల్ స్క్రీన్ అయినా ఆయనే లెజెండ్. ఎన్టీఆర్ అంటే మూడు అక్షరాలు కాదు ఒక ప్రభంజనం. ఆయనే రాముడు, ఆయనే కృష్ణుడు, ఆయనే భీముడు, ఆయనే అర్జునుడు, ఆయనే కర్ణుడు, ఆయనే ప్రజల గుండెల్లో దేవుడు.

**కూటమి అన్న తర్వాత చిన్న చిన్న సమస్యలు ఉండడం సహజం!**

ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కలిసి రాష్ట్రాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తున్నారు. ప్రధాని మోదీ మన రాష్ట్రానికి పూర్తి సహకారం అందిస్తున్నారు. మనం అడిగిన ప్రతి కోరిక తీరుస్తున్నారు. మనకు అహంకారం ఉండకూడదు, అహంకారం విర్రవీగిన గత పాలకుల 151 సీట్లు 11 అయ్యాయి. అందుకే నేల మీద ఉండి ప్రజలకు సేవ చెయ్యాలి. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నట్టు పనిచేయాలి. చిన్న కుటుంబంలోనే సమస్యలు ఉంటాయి. కూటమి అన్న తరువాత చిన్న చిన్న సమస్యలు ఉండటం సహజం. ఇగోలు పక్కన పెట్టి అందరిని కలుపుకొని పనిచేయాలి. రాసి పెట్టుకోండి విడాకులు ఉండవు. రాష్ట్రం బాగుపడాలి, ప్రజలు సంతోషంగా ఉండాలి అంటే మనం కలిసి ఉండాల్సిందే.. అని నారా లోకేశ్ వివరించారు.

# రేషన్ డీలర్లూ.. నమ్మకాన్ని నిలబెట్టండి

**జూన్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీ**
**కార్డుదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలి: డీలర్లకు మంత్రి నాదెండ్ల సూచన**
**ప్రభుత్వ నమ్మకాన్ని నిలబెట్టాలని రేషన్ డీలర్లకు పిలుపు**
**దివ్యాంగులు, వృద్ధులకు వారి ఇంటివద్దే రేషన్ అందజేత**
**విజయవాడలో ట్రయల్ రన్, సేవా శిబిరాన్ని పరిశీలించిన మంత్రి మనోహర్**



(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 29)

రాష్ట్రంలో జూన్ 1వ తేదీ నుంచి రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీని తిరిగి ప్రారంభించనున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేసిందని, రేషన్ డీలర్లు ప్రభుత్వ నమ్మకాన్ని నిలబెట్టి, కార్డుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సరుకులు పంపిణీ చేయాలని ఆయన కోరారు. జూన్ 1న పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు చెప్పారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న సన్నాహాలను పరిశీలించేందుకు మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం విజయవాడలో పర్యటించారు. మధురానగర్‌లోని 218వ నంబర్ రేషన్ దుకాణంలో నిర్వహించిన ట్రయల్ రన్‌ను ఆయన స్వయంగా పరిశీలించారు. అనంతరం విజయవాడ సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో పౌరసరఫరాల శాఖ ఏర్పాటు చేసిన చౌకధరల దుకాణాల ఈ-పాస్, వెయింగ్ మెషీన్ల సేవా శిబిరాన్ని పౌరసరఫరాల కమిషనర్ సౌరభ్ గౌర్‌తో కలిసి మంత్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విజయవాడ డివిజన్ రేషన్ డీలర్లతో మంత్రి మనోహర్ మాట్లాడుతూ, ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అందుకే రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీని మళ్లీ చేపడుతున్నట్లు తెలిపారు. దివ్యాంగులు, 65 ఏళ్ళు పైబడిన వృద్ధులకు వారి ఇళ్ల వద్దకే రేషన్ సరుకులు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. "గతంలో రేషన్ డీలర్లు కార్డుదారుల కుటుంబాలకు పెద్ద దిక్కుగా ఉండి సేవలు అందించారు. ఇప్పుడు కూడా అదే స్ఫూర్తితో, మనసుపెట్టి పనిచేసి కార్డుదారులకు గౌరవంగా సేవలు అందించాలి," అని మంత్రి సూచించారు.ప్రతినెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు, ఆదివారాల్లో కూడా రేషన్ దుకాణాలు తెరిచి ఉంచి సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ఐదో తేదీలోపే దివ్యాంగులు, వయోవృద్ధులకు ఇంటివద్దకే సరుకులు చేరేలా డీలర్లు చొరవ చూపాలని కోరారు. వాట్సాప్ గ్రూపుల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం అందించడం ద్వారా కార్డుదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడవచ్చన్నారు. ఒకవేళ సాంకేతిక సమస్యలు తలెత్తినా, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సరుకుల పంపిణీ ఆగకుండా చూడాల్సిన బాధ్యత డీలర్లపై ఉందని ఆయన స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా రేషన్ డీలర్లు పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. రేషన్ దుకాణాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, సరైన తూకంతో సరుకులు పంపిణీ చేయాలని, ధరలు, స్టాక్ వివరాల బోర్డులను స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు. ఈ-పాస్, వెయింగ్ మెషీన్ల మరమ్మతుల కోసం ఏర్పాటు చేస్తున్న సర్వీస్ క్యాంపులను సద్వినియోగం చేసుకుని, సరుకుల పంపిణీకి సర్వసన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు.ఈ సమావేశంలో విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, డీఎస్‌వో ఎ.పాపారావు, ఏఎస్‌వోలు, పౌరసరఫరాల శాఖ డీటీలు, రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

# మహానాడుకు తరలివెళ్లిన కొండపి టీడీపీ నాయకులు



(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, మే 29)

తెలుగుదేశం పార్టీ కడపలో జరిగే మహానాడు మూడు రోజుల పండుగకు కొండపి నుండి భారీగా తరలివెళ్లారు. మండల నాయకులు మాజీ ఏఎంసీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, కొండపి మండల తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



# ప్లాస్టిక్ నిషేధం పై అవగాహన

(షణ్ముఖ వెలుగు, నూజెండ్ల, మే 29)

ప్లాస్టిక్ లలో ఉండే రసాయనాలు మానవ ఆరోగ్యానికి హానికరంగా ఉంటాయని స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ కంచర్ల సుబ్బరామయ్య అన్నారు. మండలంలోని తలార్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల గొల్లపాలెం గ్రామంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ ను వాడి ఎక్కడపడితే అక్కడ పడవేయడం వలన నీటి కాలుష్యం, వాయు




కాలుష్యం ఏర్పడి క్యాన్సర్ లాంటి ప్రమాదకరమైన వ్యాధుల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా పేపర్, జూట్, క్లాత్ సంచులను ఉపయోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ మీసాల వెంకట శ్రీనివాసరావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com
3 | 30.05.25 శుక్రవారం

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం

# పనులు ఫుల్.. బిల్లులు నిల్



(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, మే 29)
మండల పరిధిలోని 19 పంచాయతీలలో జాతీయ ఉపాధి పనులకు భారీగా ఉపాధి కూలీలు హాజరవుతున్నారు. ఓ వైపు ఎండలు, మరో వైపు వానలు సైతం లెక్కచేయకుండా రెండు నెలల నుంచి పనులకు కూలీలు వెళుతున్నారు. అయితే కూలి డబ్బులు పడలేదని కుటుంబ పోషణ జరగక ఇబ్బందులు పడుతున్నామని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఉపాధి కూలీల డబ్బులు వెంటనే విడుదల చేయాలని అధికారులను వేడుకుంటున్నారు.



# పంట కాల్వల పూడికతీత, మరమ్మతు పనులు పూర్తి చేయాలి

## జల వనరుల శాఖ ఇంజినీర్లను ఆదేశించిన జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, మే 29)
పంట కాల్వల పూడికతీత, మరమ్మతు పనులను వేగంగా పూర్తి చేయాలని జల వనరుల శాఖ ఇంజినీర్లను జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ఆదేశించారు. కర్లపాలెం మండలంలో కలెక్టర్ వెంకట మురళి గురువారం విస్తృతంగా పర్యటించారు. రూ.12 లక్షలతో తిమ్మరాజు కాల్వ మరమ్మతు పనులకు జిల్లా కలెక్టర్ భూమి పూజ చేసి ప్రారంభించారు. కాల్వల పూడికతీత పనులను పరిశీలించారు. దమ్మన్న వారిపాలెంలోని చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాన్ని పరిశీలించారు. వ్యవసాయ రంగంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కలెక్టర్ చెప్పారు. రైతుల పక్షపాతి ప్రభుత్వంగా రైతుల వెంట నిలిచిందన్నారు. రైతులకు మేలు చేయడమే లక్ష్యంతో పంట కాల్వల పూడికతీత, మరమ్మతు పనులను చేపట్టిందన్నారు. వ్యవసాయ రంగంపై ఆధారపడిన బాపట్ల జిల్లాలో పంట కాల్వలను ఎప్పటికప్పుడు పూడిక తీత పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయకట్టు భూములన్నింటికీ సాగునీరు చేరేలా అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. కాల్వలలో నీరు సజావుగా దిగువ ప్రాంతాలకు వెళ్తే రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ విషయాలను అధికారులు పరిగణనలోకి తీసుకోవాలన్నారు. కృష్ణ పశ్చిమ డెల్టా పరిధిలోని పంటకాల్వల మరమ్మతులకు నిధులు విడుదల చేసిందన్నారు. బాపట్ల జిల్లాలోని కాల్వలపై 454 పనులు గుర్తించి ప్రతిపాదనల పంపగా ప్రభుత్వం రూ.12.59 కోట్లు నిధులను విడుదల చేసిందన్నారు. వాటితో జిల్లా వ్యాప్తంగా మరమ్మతు పనులు మొదలయ్యాయన్నారు. తిమ్మరాజుపాలెం గ్రామానికి వెళ్లే పంట కాలువ 10 కిలోమీటర్ల మేర మరమ్మతు పనులు ప్రారంభం అయ్యాయన్నారు. వర్షాలు రాకమునుపే, చేపట్టిన పనులన్నిటిని పూర్తిచేయాలని జల వనరుల శాఖ ఇంజినీరింగ్ అధికారులకు ఆయన సూచించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ వెంకట మురళి చెప్పారు. భావితరాల కొరకు పర్యావరణాన్ని కాపాడాలని, పర్యావరణ పరిరక్షణతోనే ప్రజల ఆరోగ్యం పదిలంగా

4



# మహానాడు విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు

## మంత్రి గొట్టిపాటి రవికుమార్



(షణ్ముఖ వెలుగు, అద్దంకి, మే 29)
కడపలో తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మహానాడుకు నియోజకవర్గ వ్యాప్తంగా తరలివచ్చి కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతం చేసిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుపై నమ్మకం, భవిష్యత్ యువ నాయకులు నారా లోకేష్ పై ఉన్న విశ్వాసం ప్రతి ఒక్క కార్యకర్త ముఖంలో స్పష్టంగా కనిపించిందని మంత్రి పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీకి నిజమైన బలంగా నిలిచి మహానాడును విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. మహానాడు వంటి మహా సంబరాన్ని ఎటువంటి ఆటంకాలు లేకుండా, కార్యకర్తలకు అసౌకర్యం కలుగకుండా నిర్వహించిన మహానాడు కమిటీలకు, యంత్రాంగానికి ప్రత్యేక అభినందనలు తెలుపుతూ మంత్రి నేడు ఓ ప్రకటన విడుదల చేశారు.

# ఇండియా టీంకి ఎంపికైన శ్రీశాంత్‌ను సన్మానించిన దోర్నాల ఎంపీపీ గుమ్మా పద్మజా యల్లేష్

(షణ్ముఖ వెలుగు,పెద్దదోర్నాల,మే 29)
జూన్ నెల 22న సౌత్ ఆఫ్రికా - కెన్యాలో జరగబోతున్న రోల్ బాల్ ఛాంపియన్షిప్ వరల్డ్ కప్ 2025కి ఇండియా టీమ్ తరఫున ఎంపికైన మోటాపర్తి శ్రీశాంత్‌ను, కోచ్ శిల్పా వాగ్రేలను హైదరాబాద్‌లోని సిఆర్పి క్యాంప్ కార్యాలయం నందు గురువారం దోర్నాల ఎంపీపీ దంపతులు గుమ్మా పద్మజా యల్లేష్‌లు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. రోల్ బాల్ ఛాంపియన్షిప్ వరల్డ్ కప్ - 2025 లో మంచి ప్రదర్శన కనబర్చాలని కోరుతూ "ఆల్ ది బెస్ట్" తెలియజేశారు.



# పర్యావరణాన్ని కాపాడుతూ పరిశ్రమలు నడుపుకోవాలి

## జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, మే 29)
బాపట్ల, జిల్లాలో పర్యావరణాన్ని కాపాడుతూ పరిశ్రమలను నడుపుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి సూచించారు. గురువారం స్థానిక కలెక్టరేట్లో ఆక్వా పరిశ్రమలు, రిసార్ట్స్ యజమానులు, హోటల్ యజమానులతో పర్యావరణ పరిరక్షణపై తీసుకోవాల్సిన చర్లపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆక్వా పరిశ్రమల్లో విడుదల చేసిన వ్యర్థ పదార్థాలను నిల్వ చేయడానికి తప్పనిసరిగా అర ఎకరా భూమిని కేటాయించాలని ఆయన చెప్పారు. ఆక్వా పరిశ్రమల్లో విడుదల చేసిన వ్యర్ధపదార్థాలను పంట కాలువలలోకి విడుదల చేయకుండా కట్టడి చేయాలని ఆయన చెప్పారు. ఇరిగేషన్ వనరులు దెబ్బతినకుండా పర్యావరణాన్ని కాపాడాలని యజమానులను కలెక్టర్ కోరారు. రొయ్య ప్రాసెసింగ్ యూనిట్లు ప్రభుత్వం ఆదేశాలను పాటించాలని యాజమాన్యానికి ఆయన చెప్పారు. రొయ్య ప్రాసెసింగ్ యూనిట్లు 45 రోజుల్లోగా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. జిల్లాలో ఆక్వా యాచరీలు 20 ఉన్నాయని, వీటిలో ఏడు ఆక్వా హేచరీలకు లైసెన్స్ లేవని అన్నారు. లైసెన్సులు లేని హేచరీలు నెలరోజుల్లోగా లైసెన్సులు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. జిల్లాలో రిసార్ట్స్ యజమానులు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి గాజు ప్లేట్లను, గాజు బాటిల్స్ వినియోగించాలని ఆయన చెప్పారు. జిల్లాలో రిసార్ట్స్ యజమానులు కోస్టల్ రెగ్యులేషన్ చట్టానికి లోబడి నిర్మాణాలు చేపట్టాలని ఆయన చెప్పారు. రిసార్ట్స్ యజమానులు పర్యాటకులకు మంచి అనుభూతి ఇచ్చే విధంగా సేవలు అందించాలని ఆయన చెప్పారు. రిసార్ట్స్ (తరువాయి 4లో...)

## పనులు ఫుల్.. బిల్లులు నిల్



### పర్యావరణాన్ని కాపాడుతూ

## పరిశ్రమలు నడుపుకోవాలి






యజమానులు పర్యాటకులకు సముద్రంలోకి ఈతకు వెళ్లే సమయంలో సూచనల బోర్డులు తప్పనిసరిగా ఇవ్వాలని ఆయన చెప్పారు. పర్యాటకులను ఉత్సాహపరిచే విధంగా ప్లాస్టిక్ ఫ్రీ బోర్డులను రిసెప్షన్లో ఏర్పాటు చేయాలని ఆయన చెప్పారు. జిల్లా పంచాయతీ అధికారి, మత్స్య శాఖ జెడి, జిల్లాపర్యాటక శాఖఅధికారి, పొల్యూషన్ బోర్డ్ అధికారులు పరిశ్రమలను, రిసార్ట్స్ ను, హొటళ్లను జాయింట్ ఇన్స్పెక్షన్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, గ్రామీణ నీటి సరఫరాశాఖ ఎస్ఈ అనంతరాజు, జిల్లా పరిశ్రమలశాఖ మేనేజర్ రామకృష్ణ, పొల్యూషన్ బోర్డ్ ఈఈ రాఘవరెడ్డి, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి గ్లోరియా, చీరాల రెవిన్యూ డివిజన్ అధికారి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# పంట కాల్వల పూడికతీత, మరమ్మతు పనులు పూర్తి చేయాలి





ఉంటుందన్నారు. ఆ గ్రామంలో చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. 350 గృహాల నుంచి వెలువడే చెత్తను గ్రామం వెలుపల డంపింగ్ చేయడంపై అధికారులను ప్రశ్నించారు. ఆ గ్రామానికి ఇద్దరు క్లాప్ మిత్రులు ఉండడం ఏమిటని, జనాభా సంఖ్యను బట్టి క్లాప్ మిత్రులను ఏర్పాటు చేసుకోవాలని డిపిఓకి సూచించారు. ఏ గ్రామంలోనైనా చెత్త దిబ్బలు కనిపించరాదన్నారు. చెత్తను కాల్చివేయడం ద్వారా పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. పరిసరాలలో పరిశుభ్రత లోపిస్తే ప్రజలు రోగాల భారిన పడతారన్నారు. ప్రతి ఇంటి వద్దనే ప్రజలు పొడి చెత్త, తడి చెత్త ను వేరుపరిచేలా అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు వేరుగా, ఇనుము వంటి లోహాలు వేరుగా, గాజు పదార్థాలు వేరుగా, భూమిలో కూలిపోయే పదార్థాలను వేరు చేసి చెత్త కుండిలో వేయాలన్నారు. కుళ్లిపోయే పదార్థాలను చెత్త సంపద కేంద్రంలో వేరుపరచి సంపద సృష్టికి సహకరించాలన్నారు. తద్వారా పర్యావరణానికి ఎలాంటి హాని ఉండదనే విషయాలను గ్రామస్తులకు వివరించాలన్నారు.

ప్లాస్టిక్ ఉద్గారాలను వేరుచేసి విక్రయించుకునే పద్ధతులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

పారిశుద్ధ్య కార్యక్రమాలలో అధికారులు నిర్లిప్తంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. అధికారులు ఛాలెంజ్ గా పనిచేయాలని సూచించారు. దుకాణాల వద్ద ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని నియంత్రించుకోవాలన్నారు. తదుపరి పర్యటనలో అధికారుల పద్ధతి మారకపోతే క్రమశిక్షణ చర్యలు ఉంటాయన్నారు. ఆయన వెంట జలవనరుల శాఖ ఎస్ఈ వెంకటరత్నం, డిపిఓ ప్రభాకర్, బాపట్ల ఇంచార్జి ఆర్డీవో లవన్న, డిఈ జాకిర్, ఎండిఓ ఏ శ్రీనివాసరావు, తహసిల్దార్ సుందరమ్మ, తదితరులు ఉన్నారు.

# 18 ఏళ్ల లోపు పిల్లల చిత్రాలను మీడియాలో చూపడం చట్ట ప్రకారం నేరం

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 29)**

18 ఏళ్ళ లోపు పిల్లల చిత్రాలను మీడియాలో చూపడం చట్ట ప్రకారం నేరమని బాలల సంక్షేమ కమిటీ ప్రకాశం జిల్లా ఛైర్మన్ వేము రామాంజనేయులు అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. బాలల న్యాయ చట్టం 2015- సెక్షన్ 74 ప్రకారం వార్తాపత్రికలలో పిల్లలు గుర్తించదగిన ఛాయాచిత్రాన్ని ప్రోత్సహించటం, బాలల న్యాయం పిల్లల సంరక్షణ, రక్షణ చట్టం- 2015 యొక్క ఉల్లంఘన అవుతుంది. ప్రత్యేకించి చట్టంతో విభేదంలో లేదా ఒక నేరం యొక్క బాధితుడు (ట్రాఫిక్ లేదా దుర్వినియోగం వంటివి) సంరక్షణ, రక్షణ అవసరం. వార్తాపత్రిక, పత్రిక, న్యూ-సీట్ లేదా ఆడియో - విజువల్ మీడియాలో ఎటువంటి ఛాయాచిత్రాన్ని ప్రదర్శించకూడదు, అలా ప్రదర్శించిన యెడల జేజే చట్టంలోని సెక్షన్ 74 యొక్క ఉల్లంఘనగా పరిగణించి వారికి 6 నెలల వరకు జైలు శిక్ష లేదా 2 లక్షల వరకు జరిమానా లేదా రెండు విధించడం జరుగుతుందని చట్టం తెలియపరుస్తుంది. అదే విధంగా ప్రభుత్వ విభాగాలు,ఎన్జీవోలు, ఎస్సీపీసీఆర్, డిసిపియు సిడబ్ల్యుసి అధికారులు కూడా ప్రసురనను నిరోధించటంలో అధికారం అనుమతి లేదా విఫలమైతే లేదా పిల్లల గుర్తింపును కాపాడటానికి వారి విధిలో నిర్లక్ష్యంగా ఉంటే అప్పుడు వారు కూడా ఈ విభాగం కింద బాధ్యత వహించవలసి వస్తుంది. సెక్షన్ 74 సబ్ సెక్షన్ (3)క్రింద ఉప సెక్షన్ 1 యొక్క నిబంధనలను ఉల్లంఘించిన ఏ వ్యక్తి అయినా 6 నెలల వరకు జైలు శిక్షతో శిక్షించబడతారు లేదా 2 లక్షల వరకు జరిమానా లేదా రెండింటిని విస్తరించవచ్చన్నారు. పత్రిక విలేకరులు, మీడియా ప్రతినిధులు ప్రతి ఒక్కరూ పై అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి జువైనల్ అనగా 18 సంవత్సరాలలోపు సంబంధించిన బాల, బాలికల యొక్క ఛాయాచిత్రాన్ని మీడియాలో ప్రదర్శించడంలో తగు జాగ్రత్తలు తీసుకోగలరని మీడియా మిత్రులకు సూచించారు.




# తెనాలిలో దళిత యువకుల పై తాలిబన్ పోలీస్ దాడి చేసిన ఇద్దరు సీఐలను అరెస్టు చేయాలి

## బాధ్యుడైన తెనాలి మంత్రి నాదెండ్లను మంత్రివర్గం నుంచి తొలగించాలి

## ఒంగోలు కలెక్టరేట్ వద్ద ఆందోళనలో దళిత నేత నీలం డిమాండ్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 29)

తెనాలిలో దళిత యువకులపై నడిరోడ్డుపై తాలిబన్ తరహా పోలీస్ దాడి జరిపించిన జనసేన రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ ను మంత్రివర్గం నుంచి తప్పించాలని కిరాతక తెనాలి పోలీస్ ఇన్స్పెక్టర్లు రాముల నాయక్ , రమేష్ బాబులను అరెస్టు చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. తెనాలిలో ఈ నెల 24వ తేదీన ఐతా నగరకు చెందిన దళిత యువకులైన హైకోర్టు న్యాయవాది మరియు మరో ఇద్దరు యువకులను తెనాలిలో జనసేన ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్ర మంత్రిగా సనాతన స్టార్ పవన్ కళ్యాణ్ రాజకీయ గురువుగా చలామణి అవుతున్న నాదెండ్ల మనోహర్ కుట్రతో తెనాలి టూ టౌన్ 3 టౌన్ సిఐలు దళితులను భయప్రాంతలు చేయడానికి బహిరంగంగా తాలిబన్లు పోలీస్ దాడి చేశారన్నారు. కొన్ని నెలల క్రితం తెనాలి ఐతానగర్లో అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించడానికి మంత్రి నాదెండ్ల మనోహర్ పోలీస్ , మునిసిపల్ అధికారుల చేసిన కుట్రను దళితులు అడ్డుకున్నారన్నారు. ఈ క్రమంలో నాదెండ్ల మనోహర్ మూడు రోజుల పాటు జరిగిన దళితుల ఆందోళనలో ఓడిపోయి అంబేద్కర్ విగ్రహాన్ని కొత్తది ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ మూడు రోజుల ఆందోళనలో తెనాలి త్రీ టౌన్ టూ టౌన్ రాములు నాయక్, రమేష్ బాబులకు , దళితుల మధ్య విభేదాలు వచ్చాయి అన్నారు. అవకాశం కోసం చూస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్ చిరంజీవి అనే ఐడి పార్టీ కానిస్టేబుల్ చేత దళిత యువకులను బెదిరించి డబ్బుల కోసం డిమాండ్ చేసి తప్పుడు ఫిర్యాదు చేశారన్నారు . ఈ క్రమంలోనే రౌడీషీటర్ల పేర్లతో రెచ్చిపోయిన తెనాలి సిఐలు ఇద్దరు తెనాలి దళితులని భయభ్రాంతులకు గురిచేయడానికి తాలిబన్ల లాఠీలతో ఆటవిక దాడి చేశారన్నారు. తెలుగుదేశం మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కూడా రౌడీ షీటర్ అనే అన్నారు. పోలీస్ రౌడీషీటర్గా ఉన్నవారు కూడా ఎమ్మెల్యే ఎంపీగా పోటీ చేయడానికి అర్హులు అనే అన్నారు. ప్రస్తుత హోం మంత్రి వంగలపూడి అనిత, తనపై 23 క్రిమినల్ కేసులు ఉన్నాయని వెల్లడించిందన్నారు. గుజరాత్ లో ముస్లిం ఊచ కోత ఘటనలో రాష్ట్ర బహిష్కరణకు గురయ్యాడన్నారు .మాజీ ముఖ్యమంత్రి జగన్ 16 నెలల జైల్లో ఉండి ఇప్పటికీ అనేక ఆర్థిక నేరాల కేసులో, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఎన్నికల ముందు 58 రోజులు జైల్లో ఉండి వచ్చారన్నారు. క్రిమినల్ కేసులో జైల్లో ఉండి బెయిల్ పైన బయటకు వచ్చారు అన్నారు. సంచలనం సృష్టించిన పేద ప్రజల పెన్నిధి అజాతశత్రువు వీరయ్య చౌదరి హత్య కేసులో కిరాయి హంతకుల్ని కూడా అరెస్టు చేసి వారి మొహాలు తెలియకుండా ముసిగేసి పోలీస్ అధికారులు మీడియాకి చూపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చట్టబద్ధమైన లిక్కర్ , ఇసుక వ్యాపారాలు చేస్తున్నా వీరయ్య చౌదరి అంతక్రియలకు హాజరయ్యారు. వీరయ్య చౌదరి హంతకులకు భూమ్మీద జీవించే హక్కు లేదన్నప్పటికీ ముఖ్యమంత్రి భావోద్వేగంతో అంటే ఎన్కౌంటర్ జరిగిందేమో అనుకున్నప్పటికీ తెనాలి పోలీసులు లాగా నడిరోడ్డుపై కొట్టకుండా చట్ట ప్రకారం అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారన్నారు. ఇటీవల ఇష్టపడిన మహిళతో రోడ్డుపై వ్యభిచారం చేసిన బిజెపి నేతను చట్టవిరుద్ధమని పోలీసులు అరెస్టు చేసి జైలుకి పంపించారన్నారు. గత ప్రభుత్వంలో చీరాలలో రోడ్డు మీద దళిత యువకుడు కిరణ్ ను లాఠీలతో కొట్టి చంపిన చీరాల టూ టౌన్ ఎస్సై విజయ్ కుమార్ను హత్యా నేరంపై అరెస్టు చేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెనాలి దళిత యువతుల ఘటనపై జనసేన తాలిబన్ పోలీస్ దాడిని విచారణ జరిపించాలని తెనాలి టూ టౌన్ 3 టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్లు రాములు నాయక, రమేష్ బాబులను అరెస్టు చేయించాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ విగ్రహం నుంచి ఎమ్మార్పీఎస్ , మాల సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ కలెక్టరేట్ వరకు జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రావినూతల కోటి మాదిగ, మాల సంఘాల జేఏసీ నాయకులు కుళ్ళి బిల్లి అశోక్ బాబు, కొప్పోలు ఏడుకొండలు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు రఘురాం, లిబరేషన్ కాంగ్రెస్ జిల్లా కన్వీనర్ చిరుతోటి శోభన్, మోజెస్, యానాది సంఘ నాయకులు జీవరత్నం, మాల మహానాడు అధ్యక్షుడు, దారా అంజయ్య , కాకుమాని రవి మాదిగ, మహాసభ నాయకులు దండపుడి యోహాన్, తదితరులు పాల్గొన్నారు.







# కరేడు, అలగాయపాలెం గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం







(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 29)

మండల పరిధిలోని కరేడు, అలగాయపాలెం గ్రామాల్లో గురువారం కెవికె సీనియర్ శాస్త్రవేత్త అధిపతి డా.జి. ప్రసాద్ బాబు అధ్యక్షతన వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా.జి.ప్రసాద్ బాబు మాట్లాడుతూ రాబోవు ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంటలో చేపట్టాల్సిన ఉత్తమ యాజమాన్య పద్దతుల గురించి, ట్యాగ్-73, ఐసిజిఎస్-1694, నిత్యహరిత వంటి నూతన వేరుశనగ వంగడాల గురించి, ఎరువుల మోతాదు, చీడపీడల యాజమాన్యం గురించి రైతులకు విపులంగా వివరించడం జరిగింది. అలాగే ప్రకృతి వ్యవసాయ విధానాల గురించి, ధ్రువీకరణ గురించి రైతులకు వివరించారు. కందుకూరు నిర్మా పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా. బిటిఎం కృష్ణ వేరుశనగలో ప్రధాన సమస్య అయిన నులిపురుగుల నివారణకు వేసవిలో లోతు దుక్కులు చేసుకోవాలని, జొన్న, సజ్జా, బంతి పేర్లతో పంట మారిపిడి పాటించాలని, పిసిలోమైసిస్ అనే జీవ పురుగు నివారణ మందును సేంద్రీయ ఎరువులో కలుపుకొని పొలంలో చల్లుకోవాలని, ఎకరాకు 200 కిలోల వేపచక్క వేసుకోవాల్నె తెలిపారు. అనురాధా మాట్లాడుతూ నెల సారవంతత పెంచుకోవడానికి ప్రతి రైతు జనుము, జీలుగ, పిల్లిపెసర, అలసంద వంటి పచ్చి రొట్ట పైర్ల విత్తనాలు ఎకరాకు 10 నుండి 15 కిలోలు చల్లుకొని పూత దశలో భూమిలో కలియదున్నుకొని 50 కిలోల ఎస్ఎస్‌పి ఎరువును వేసుకోవాలని తెలిపారు. అలాగే రైజోబియం, పి.ఎస్.బి, కె.ఎస్.బి. వంటి జీవన ఎరువులు, ట్రైకోడెర్మ విరిడే, సూడోమోనాస్ వంటి జీవ శిలీంద్ర నాశినులను 100 కిలోల పేడ ఎరువులో కలుపుకొని 15 రోజులు మగ్గనిచ్చి ఎకరా పొలంలో సమానంగా చల్లుకోవాలని తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాలను రైతులకు తెలియజేశారు. కందుకూరు వ్యవసాయ సబ్ డివిజన్ అధికారిని అనసూయ మాట్లాడుతూ రైతులు అన్నదాత సుఖీభవ పథకం కోసం మరియు ఫార్మర్ రిజిస్ట్రీ లో రెజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందిస్తున్న పథకాల గురించి రైతులకు వివరించారు. స్వయం సహాయ సంఘ మహిళలు నమో డ్రోన్ డీడీ పథకాన్ని సద్వినియోగం చేసుకొని ఉపాది పొందాలని తెలిపారు. హైదారాబాద్‌లో ఉన్న కోళ్ల పరిశోధనా స్థానం నుండి విచ్చేసిన ప్రధాన శాస్త్రవేత్త డా.కణ్ణన్ మాట్లాడుతూ వనరాజా, గిరిరాజ, గ్రామప్రియ, ఆశీల్ వంటి నూతన అధిక గుడ్లను, మాంసాన్ని ఇచ్చే కోళ్ళ జాతులను తయారుచేశామని వాటిని రైతులు కోళ్ళ పరిశ్రమ పెట్టుకొని ఉపాది పొందవచ్చునని తెలిపారు. అలాగే వాణిజ్య సరలిలో గొర్రెలు, మేకలు, పొట్టేళ్ళ పెంపకం చేపట్టడం ద్వారా అధిక లాభాలు ఆర్జించవచ్చునని తెలిపారు. అలాగే వుర్మి అనే స్టార్టప్ కంపెనీ ప్రతినిది రాకేశ్ మాట్లాడుతూ తమ కంపెనీ ద్వారా రైతులకు డ్రోన్ అమ్మకాలు, రిపేర్లు, డ్రోన్ ద్వారా పిచికారి సేవలు అందిస్తున్నామని, కచ్చిత వ్యవసాయాన్ని ప్రోత్సహించి ఖర్చు తగ్గించడానికి శాటలైట్ ద్వారా మట్టి పరీక్షలు చేసి ఫలితాలను రైతులకు అందిస్తున్నామని ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని తెలిపారు. కోరమాండల్ కంపెనీ ప్రతినిధి షేక్ నబీ మాట్లాడుతూ రైతులకు పురుగు మందుల పిచికారికి ఒక ఎకరా నుంచి వందల ఎకరాలకు చేసుకోవాలనుకునే వారు తమను సంప్రదిస్తే వారి డ్రోన్ ద్వారా తక్కువ ఖర్చుతో పిచికారి చేస్తామని తెలిపారు. రైతులకు వివిద పంటలలో ఉత్తమ యాజమాన్య పద్దతులపై, కేంద్ర ప్రభుత్వ పథకాలపై తయారు చేసిన పుస్తకాలను అందివ్వడం జరిగింది. అలాగే డ్రోన్లతో పంటలో పిచ్చికారి చేసే విధాన ప్రదర్శనను నిర్వహించడం జరిగింది. కరేడు లో మరియొక బృందం ఉలవపాడు మండల అధికారిని తిరుమల జ్యోతి, కేవీకె శాస్త్రవేత్తలు డా.వెంకటేష్, డా.శ్రీరంగ, నిర్మా శాస్త్రవేత్త గంగాధర్, బిటియమ్ కృష్ణ కలిసి రైతు సేవాకేంద్రం లో రైతులకు పంటలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు, రైతు మహిళలు, యువత, ఔత్సాహికులు, తదితరులు పాల్గొన్నారు.

## పైప్‌లైన్ పనులు పూర్తి చేసిన నగర పంచాయతీ అధికారులు

(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 29)

స్థానిక పీఎన్ఆర్ కాలనీ ప్రజలు ఎన్నో రోజులుగా తాగు నీళ్లకు ఇబ్బంది పడుతున్నారని తెలిసి మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదేశాల మేరకు యువ నేత కందుల విగ్నేష్‌రెడ్డి సహకారంతో మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ నారాయణరెడ్డి, ఏఈ శంకర్ నాయక్‌ల సూచనల మేరకు పైప్ లైను పనులు గురువారం పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు కన్వీనర్ వెలుగు వెంకటేశ్వర్లు, బొడ్డు సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు. దీంతో ఆ ప్రాంత ప్రజల నీటి సమస్య





పరిష్కరించినట్లైంది. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## యోగాతో మానసిక ఉల్లాసం





(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, మే 29)

యోగాతో మానసిక ఉల్లాసంగా, ఆరోగ్యంగా ఉండవచ్చని కొండపి మండల విద్యాశాఖ ఎంఈఓ రామారావు తెలిపారు. యోగా చేయండి..ఆరోగ్యంగా ఉండండి అని పిలుపునిచ్చారు. యోగా శిక్షణ తరగతుల్లో భాగంగా కొండపి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈ శిక్షణా తరగతుల్లో పాల్గొనడం ఎంతో మానసికంగా ఉల్లాసంగా ఉందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ యోగ రోజు చేయాలని ఎంఈఓ సూచించారు. ఈ యోగా కార్యక్రమంలో స్థానిక గ్రామ ప్రజలు పంచాయతీ రెవెన్యూ అధికారులు భారీగా హాజరవుతున్నారని ఈ కార్యక్రమానికి విశ్లేషణ స్పందన వస్తుందని కొండపి ఎంపీడీవో రామాంజనేయులు తెలిపారు.

## వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఖోఖో పోటీలు





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 29)

ఉలవపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా గురువారం విద్యార్థులతో ముందుగా నీతి కథలు జాతీయ నాయకుల జీవిత చరిత్రలు విజ్ఞానదాయకమైన పుస్తకాలు చదివించి అనంతరం పిల్లల్లో దాగివున్న సృజనాత్మక శక్తి వెలికితీసే క్రమంలో వారికి ఖో ఖో పోటీలు నిర్వహించారు. చివరిగా వారికి స్నాక్స్, డ్రింక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో 34 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు గ్రంథాలయ పాలకుడు డి. కోటేశ్వరరావు తెలిపారు. స్టోరీ టెల్లింగ్, ఫ్యాకల్టీ, యాక్టివిటీస్‌లో డి.రమాదేవి పాల్గొన్నారు.

## ఉపాధిలో తొమ్మిది వారాల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, మే 29)

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో పనిచేసిన కూలీలకు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హనుమంతునిపాడు మండలం సీతారాంపురం గ్రామంలో ఉపాధి కూలీల పని ప్రదేశంలో ఉపాధి కార్మికులతో సమస్య లను పరిశీలించారు ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ మార్చి నెల నుండి ఉపాధిలో పనిచేసే శ్రామికులకు బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందని ఆగ్రహాన్ని వ్యక్తపరిచారు పనిచేసిన చివరి రోజు బట్వాడ చెల్లించాలని చట్టం చెప్తుంటే చట్టాన్ని అమలు చేసే అధికారులు కూలీల పట్ల నిర్లక్ష్యపు ధోరణి ప్రదర్శించడం సరికాదన్నారు. నెలల తరబడి పెండింగ్ బిల్లులు చెల్లించకుండా ఇబ్బంది పెడితే శ్రామికులు ఏం తిని పనిచేయాలని బతకాలని ప్రశ్నించారు. ప్రస్తుత తోటి ఉపాధి శ్రామికులు బతకాల అని ఆందోళన వ్యక్తపరిచారు. ఉపాధిలో పనిచేసే మైట్లకు తగిన గుర్తింపు లేదని ప్రభుత్వం నేటికైనా మేట్లను గుర్తించి వారికి అదనపు పారితోషకం అందించాలని కోరారు. ప్రభుత్వం మార్కెట్లో నిత్యవసర వస్తువుల ధరలు పెట్రోలు,డీజిల్ వంట నూనె ధరలు రోజురోజుకు పెంచుకోస్తున్నారని, కానీ ఉపాధి కూలీలకు ఇచ్చే వేతనాలు పెంచడం లేదని తెలిపారు. ప్రతి కూలికి తన కుటుంబం బతకాలంటే కనీసం రోజు కూలి రూ.600లు తగ్గకుండా ఇవ్వాలని, ప్రతి జాబ్ కార్డు లో ఉన్న శ్రామికునికి 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయం దివాలా తీసిందని ప్రకృతిపై ఆధారపడి వ్యవసాయం చేసే రైతులు సైతం ఉపాధి కూలీలుగా మారారని , ఇలాంటి పరిస్థితుల్లో రైతు కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలని అందుకోసం కేంద్ర బడ్జెట్లో 2 లక్షల కోట్లు ఉపాధి నిధులు పెంచాలని కోరారు . రాష్ట్రానికి రావల్సిన పెండింగ్ బిల్లులను కేంద్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉన్నతాధికారులు పని ప్రదేశాలను ప్రత్యక్షంగా పరిశీలించాలని, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి మెట్లు కనకరాజు,మాల్యాద్రి, నారాయణ, తిరుపతయ్య,మురళి, శ్యామ్ ప్రసాద్ ,వెంకటేశ్వర రెడ్డి తోపాటు కూలీలు పాల్గొన్నారు.



## కామేపల్లి పోలేరమ్మ అమ్మవారి హుండీ లెక్కింపు



(షణ్ముఖ వెలుగు, జరుగుమల్లి, మే 29)

జరుగుమల్లి మండలంలో వెలిసిన కామేపల్లి పోలేరమ్మ అమ్మవారి హుండీ లెక్కింపు ఈ నెల 31 ఉదయం 10 గంటలకి అధికారుల పర్యవేక్షణలో జరుగుతుందని ఆలయ ఈవో బైరాగి చౌదరి తెలిపారు ఈ హుండీ లెక్కింపులో ఎండోమెంట్ అధికారులు బ్యాంకు అధికారులు సాధారణ భక్తులు అమ్మవారి సేవలో ఎవరైనా సామాన్య భక్తులు పాల్గొనవచ్చునని ఆలయ ఈవో ఒక ప్రకటనలో తెలిపారు.

## కడప మహానాడులో పాల్గొన్న చాకిచెర్ల టిడిపి నాయకులు



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 29) కడపలో గురువారం మూడవ రోజున నిర్వహించిన మహానాడు వేడుకల్లో పాల్గొని మర్యాదపూర్వకంగా కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావును కలిశారు. ఈ కార్యక్రమంలో ఉలవపాడు మండలం చాకిచెర్ల గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన టిడిపి నాయకులు సుదర్శి శ్రీనివాసులు, తాడితోటి రవిబాబు, సుదర్శి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ బదిలీలలో దివ్యాంగుల పేరుతో బోగస్ దివ్యంగా ఉపాధ్యాయులు దరఖాస్తులను మరోసారి పరిశీలించాలి



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, మే 29) ఉపాధ్యాయ బదిలీల లో లబ్దికోసం వైకల్యం లేకున్నా ఫేక్ సర్టిఫికెట్లతో కొందరు ఉన్న వైకల్యానికి మించిన శాతం వేయించుకొని , మరికొందరు ప్రకాశం జిల్లాలో ఉపాధ్యాయ బదిలీల కోసం దివ్యాంగుల సర్టిఫికెట్ కోసం ఎక్కువ మొత్తంలో డబ్బులు ముట్ట జెప్పి ఫేక్ సర్టిఫికేట్లు తెచ్చుకున్నారని వికలాంగుల హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు ధూళిపాళ్ళ మల్లిఖార్జునరావు ఆరోపించారు. ఉపాధ్యాయ బదిలీలలో దివ్యాంగులు కాని ఉపాధ్యాయుల సర్టిఫికెట్ పై విచారణ నిర్వహించి, దివ్యాంగులు కాని వారి పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

## ఆరు శాసనాలు ప్రగతికి సోపానాలు

### మహానాడును విజయవంతం ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు -ఎమ్మెల్యే జూలకంటి



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, మే 29) కడప గడ్డపై పసుపు సైన్యం పండుగ మహానాడు వేదికపై ప్రవేశపెట్టిన ఆరు శాసనాలు కార్యకర్తల ప్రగతి సోపానాలు అని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం ఓ ప్రకటన ఆయన మాట్లాడుతూ. కడప కేంద్రంగా మూడు రోజులు పాటు అంగరంగ వైభవంగా నిర్వహించిన మహానాడు ఎంతో అద్భుతంగా జరిగిందని ఆయన పేర్కొన్నారు. లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తలకు, నాయకులకు, ప్రజా ప్రతినిధులకు ఎటువంటి లోటు లేకుండా అన్నీ ఏర్పాట్లు బ్రహ్మాండంగా చేశారని హర్షం వ్యక్తం చేశారు. కార్యకర్తల సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడే పార్టీ తెలుగుదేశం పార్టీ అని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధికి పార్టీ అధినేత, ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్వర్ణాంధ్రప్రదేశ్ - 2047 కు పిలుపునివ్వగా, ఆయన సంకల్పం సఫలీకృతం అయ్యేందుకు పార్టీ ప్రధాన కార్యదర్శి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కార్యకర్తల అభ్యున్నటికీ ఆరు శాసనాలను ప్రవేశపెట్టారని వివరించారు. మాచర్ల నియోజకవర్గం నుంచి కడప మహానాడుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, కార్యక్రమాలను విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే జూలకంటి కృతజ్ఞతలు తెలియజేశారు.

## రోడ్లపై చెత్త వేస్తే కఠిన చర్యలు



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, మే 29) తమ గృహాలలోని చెత్తను రోడ్లపై వేస్తే కఠిన చర్యలు తప్పవంటూ సర్పంచి రామవత్ అరుణబాయి హెచ్చరించారు. గురువారం ఆమె మాట్లాడుతూ నిత్యం పంచాయతీ కార్మికులు పంచాయతీలలో పర్యటనలు చేస్తున్నారని, కానీ కొందరు ప్రధాన రహదారులు తమ గృహాలలోని చెత్తను రోడ్లపై వేస్తున్నారన్నారు. దీనివలన ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందంటూ ఆమె అన్నారు. తమ గృహాలలోని చెత్తను పంచాయతీ కార్మికులు వచ్చిన సమయంలో మాత్రమే అందజేయాలంటూ ఆమె సూచించారు. మరో మారు అలా కాక ఇలా రోడ్లపై డివైడర్లపై చెత్తను వేస్తే అటువంటి గృహ యాజమాన్యం పై రూ.1000ల జరిమానా విధిస్తానంటూ ఆమె హెచ్చరించారు.

# బహిరంగ సభకు భారీగా తరలిన టీడీపీ శ్రేణులు



(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, మే 29) డైనమిక్ లీడర్ కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశానుసారం హనుమంతునిపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల నుంచి తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు నందమూరి నారా వారి అభిమానులు తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే మహానాడు బహిరంగ సభకు భారీగా తరలి వెళ్లారు. పసుపు దండు పండుగకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహం ఉరకలు వేయంగా కనిగిరిలో కార్యకర్తలు కదం తొక్కారు. ఈ సందర్భంగా హనుమంతునిపాడు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతి రెడ్డి మాట్లాడుతూ తెలుగు జాతి ఘనకీర్తిని విశ్వ వ్యాప్తంగా తెలియజేసిన ఘనుడు ఆంధ్రుల అభిమాన ఆరాధ్య దైవం నందమూరి తారక రామారావు అని కొనియాడారు. పేద బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతిగా తెలుగువారి ఆత్మ గౌరవ పరిరక్షకునిగా మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేసులు యన్.టి. రామారావు సంక్షేమ సారథిగా అభివృద్ధికి ఆదర్శకునిగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఆయన జన్మదినం సందర్భంగా జరుపుకునే మహానాడు పసుపు దండుకు పండుగ అని అందులో ఈసారి మొదటిసారిగా దేవుని గడప కడపలో జరుపుకోవటం ప్రాముఖ్యత సంతరించకుందనీ తెలిపారు. మన ప్రియతమ నేత నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి సంక్షేమం సమ పాళ్ళుగా ప్రభుత్వాన్ని పార్టీని నడిపిస్తున్నారని అన్నారు. విజనరీ లీడర్ చంద్రబాబు యువ నాయకుడు లోకేశ్ బాబు కార్యకర్తలకు వెన్నుదన్నుగా ఉంటున్నారని తెలిపారు. కనిగిరిని కనుక పట్టణంగా మార్చుటకు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి వారు శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నారని రాష్ట్రస్థాయిలో సూపర్ శిక్స్ అమలుతోపాటు నియోజకవర్గంలో పాంచ్ పటాకా అమలు జరుగుతుందని తెలిపారు. బడుగుల బంధువు పేదల పాలిట పెన్నిధి కనిగిరి శాసన సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి కనిగిరి నియోజకవర్గ ప్రజల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. నడికుడి శ్రీ కాళహస్తి రైల్వే లైన్ త్వరితగతిన పనులు జరుగుతున్నాయని బైపాస్ రోడ్డు పూర్తయిందని, ఈ సందర్భంగా గుర్తు చేశారు. రిలయిన్స్ బయో గ్యాస్ కంపెనీల వలన నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించటం తోపాటు రైతులకు అధిక (30000వేల వరకు)కౌలు వస్తుందని కనిగిరి నియోజకవర్గంలో ట్రిబుల్ ఐటీ ఏర్పాటు చేసి విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేస్తున్నారన్నారు. గతంలో పొగాకు బోర్డు షిప్ యార్డ్ మోపాడు రిజర్వాయర్ అలవలపాడు బ్రిడ్జి ఆదర్శ పాఠశాల ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతి రెడ్డి తోపాటు బ్రహ్మం గౌడ్ , కొండెపోగు రాబర్ట్ , కూడలి దశరథ, ఉప్పుటూరి గుంటేయ్య , టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మహానాడుకు తరలివెళ్లిన టీడీపీ నాయకులు



(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, మే 29) పెద్దారవీడు మండలం నుంచి పెద్ద సంఖ్యలో ఎంతో ఉత్సాహంగా మహానాడుకి టీడీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు నాయకత్వంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మెట్టు శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన భారీగా పసుపు శ్రేణులు తరలివెళ్లాయి. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు మాట్లాడుతూ కూడు, గుడ్డ, నీడ అనే నినాదంతో స్వర్గీయ నందమూరి తారక రామారావు ఉమ్మడి రాష్ట్రంలో పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల కాలంలోనే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి తీసుకువచ్చి చరిత్ర తిరగరాశారని అన్నారు. మాజీ మండల పార్టీ అధ్యక్షులు గొట్టం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇప్పుడు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు మహానాడు కడప గడ్డపై నిర్వహించడం ఒక చారిత్రాత్మక ఘట్టమని ఈ మహానాడు చరిత్రలో నిలిచిపోతుందని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, టీడీపీ జాతీయ కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్‌లు పార్టీని సమర్థవంతంగా నడిపిస్తూ తిరుగులేని శక్తిగా పార్టీని మార్చారన్నారు. రాష్ట్ర అభివృద్ధికి చంద్రబాబు ఎంతో శ్రమిస్తున్నారని అన్నారు. జూన్ మాసం లో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ,ఆగష్టు 15నుంచి మహిళలకు ఉచిత బస్సు, ప్రారంభించనునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు గొట్టం శ్రీనివాస్ రెడ్డి, నెల్లూరు రూరల్ టీడీపీ అబ్జర్వర్ గుమ్మా గుంగరాజు, గుండంచర్ల సర్పంచ్ ఇండ్ల రామకృష్ణారెడ్డి. మండల టీడీపీ నాయకులు గా. యోగిరెడ్డి, బొచ్చు. ఆదినారాయరెడ్డి, బొచ్చు, వెంకటేశ్వరెడ్డి, పోతిరెడ్డి వీరారెడ్డి,పోలేబోయిన. వెంకటరమణ, తిరుమలరెడ్డి వెంకటేశ్వర రెడ్డి , తిరుమల్ రెడ్డి చిన్న వెంకటరెడ్డి, తిరుమలరెడ్డి శేఖర్ రెడ్డి, అనేకాళ్ళ శ్రీనివాసరెడ్డి, డి.చిన్న కొండారెడ్డి, వీర్ల ముసలయ్య,లక్కకుల వెంకటేశ్వర్లు, గాజులపల్లి పెద్దయ్య, జీ.కాసేయ్య, చిన్నబోయిన పుల్లయ్య, సత్యంరెడ్డి, సుధాకరెడ్డి, మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు



## మైనర్లు వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవు

### ద్విచక్ర వాహనదారులు వాహన పత్రాలు కలిగి ఉండాలి

### బాపట్ల పట్టణ ఎస్ఐ చంద్రావతి





(షణ్ముఖ వెలుగు, బాపట్ల, మే 29) బాపట్ల పట్టణం ఆంజనేయస్వామి గుడి వద్ద గురువారం పట్టణ ఎస్ఐ చంద్రావతి వాహనాల తనిఖీలు చేశారు. వాహనదారులకు కొన్ని సూచనలను సూచించారు. పట్టణంలో మైనర్లు ఎక్కువగా వాహనాలు నడపడం వల్ల ఎక్కువగా యాక్సిడెంట్‌కు కారణం అవుతున్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటాము, వాహన దారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాన్ని నడపాలని అలాగే డ్రైవింగ్ లైసెన్స్ వాహన పత్రాలు వాహనంలో ఉంచుకోవాలని తెలిపారు. పట్టణంలో కొన్ని వాహన తనిఖీ చేయగా డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి అపరాధ రుసుము విధిస్తూ, మరోసారి డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పట్టణంలో ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ, నిబంధనలు పాటిస్తూ పట్టణ పోలీసులకు సహకరించాలని తెలిపారు.

# దళిత యువకుల పై అత్యుత్సాహాన్ని ప్రదర్శించిన పోలీసులను సస్పెండ్ చేయాలి

### జై భీం రావు పార్టీ పర్రె కోటయ్య



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, మే 29) గుంటూరు జిల్లా తెనాలి ఐతానగర్‌లో దళిత మైనార్టీ యువకులపై పోలీసులు బహిరంగంగా థర్డ్ డిగ్రీ ప్రయోగించడాన్ని నిరసిస్తూ పోలీస్ అధికారులను సర్వీస్ నుండి రిమూవ్ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టినటువంటి నిరసన దీక్షలో జైభీమ్ రావ్ భారత్ పార్టీ తరపున రాష్ట్ర కార్యదర్శి న్యాయవాది దోవా రమేష్ రాంజీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు పర్రె కోటయ్య పాల్గొన్నారు. పర్రె కోటయ్య మాట్లాడుతూ తెనాలి పట్టణంలో దళిత యువకులపై పోలీసులు చూపిన అత్యుత్సాహంపై చల్లించిపోయామని బహిరంగంగా యువతకు థర్డ్ డిగ్రీ ఇవ్వటం ఏమిటని చట్టాన్ని చేతిలోకి తీసుకునే అధికారం పోలీసులకు ఏ సందర్భంలో వస్తుందో వారికి తెలియదా అన్నారు. తెనాలి పట్టణంలో అను నిత్యం గంజాయి కేసులు ఎక్కువగా నడుస్తున్నప్పటికీ వాటిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా ఒక దళిత యువకులపై చర్యలు తీసుకోవడం దళితులపై పోలీసుల అత్యుత్సాహం ఏమిటో అర్థం కావడం లేదని పర్యకోటయ్య అన్నారు. కన్నా చిరంజీవి అనే కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కానిస్టేబుల్ పై జరిగిన దాడి స్థానికంగానే జరిగింది. కాబట్టి అక్కడ ఉన్న ప్రాంతాల్లో నిఘా నేత్రాలు పనిచేయలేదా,పని చేస్తే ఎందుకు అప్పుడే చర్యలు తీసుకోలేదు. కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదుని పత్రిక ముఖంగా ఎందుకు చెప్పలేదు, కానిస్టేబుల్ అకౌంట్‌లోకి దళిత యువకుల నుంచి ఎంతెంత నగదు జమ అయిందో చూశారా ఇవేవీ చూడకుండా దళితులపై ఆగ్రహాన్ని వ్యక్తం చేసిన పోలీసులు సమాధానం చెప్పాలని జై భీమ్ రావు పార్టీ బాపట్ల జిల్లా ఇన్చార్జి పర్రెకోటయ్య ప్రశ్నిస్తున్నారు. దళితులపై అత్యుత్యాహాన్ని ప్రదర్శించిన పోలీసులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని వారిని తక్షణమే సస్పెండ్ చేయాలని జై భీమ్ రావు పార్టీ తరపు నుంచి డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఈ దీక్షకు మద్దతుగా ఏపీ ఎమ్మార్పీస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరు పోగు వెంకటేశ్వరరావు మాదిగ . విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ జె.విద్యాసాగర్, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి, అఖిలభారత మాల సంఘాల జేపీసీ కన్వీనర్ గుర్రం రామారావు, భీమ్సేన సేవాదళ్ రాష్ట్ర కన్వీనర్ నీలాంబరం తదితర ప్రజా సంఘాల నాయకులు పాల్గొనగా దీక్షకు బొనిగల ప్రదీన్ నాయకత్వం వహించారు.

# సబ్సిడీ రుణాలలో అర్హులైన దివ్యాంగులకు రిజర్వేషన్‌లు అమలు చేయాలి

(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 29)



పొదిలి నగర పంచాయితీ కమిషనర్‌ను కలిసి పొదిలి నగర పంచాయితీలోని అర్హులైన దివ్యాంగులకు బీ.సీ, ఎస్సీ, మైనారిటీ మొదలగు కార్పొరేషన్లకు సంబంధించిన సబ్సిడీ రుణాలలో అర్హులైన దివ్యాంగులకు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జీ.వో. ఎం.ఎస్.నెంబర్. 43 ప్రకారం 5% రిజర్వేషన్ అమలుపరచాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ముల్లా మదార్ వలి కోరారు. వివరాలలోకి వెళితే.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అర్హులైన దివ్యాంగులకు బి.సి, ఎస్సీ, మైనారిటీ మొదలగు కార్పొరేషన్ల ద్వారా రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులకు జీ.వో. ఎం.ఎస్. నెంబర్. 43 ప్రకారం 5% రిజర్వేషన్ అమలుపరచాలని కోరుకుంటున్నామన్నారు. అలాగే దరఖాస్తు చేసుకున్న అర్హులైన దివ్యాంగులకు పొదిలి మండలంలోని కొన్ని బ్యాంకులలో రుణాలు పొందాలంటే చాలా కష్టంగా మారింది. దివ్యాంగులు మీరు ఏ విధంగా రుణాలు చెల్లిస్తారని దివ్యాంగుల ఆత్మ గౌరవాన్ని కించపరిచే విధంగా మాట్లాడుతున్నారు. ఇది మంచిది కాదు జాతీయ దివ్యాంగుల హక్కుల చట్టం 2016 ప్రకారం విచారించి తమరే చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నామని తెలిపారు. అలాగే పొదిలి మండలంలోని అర్హులైన దివ్యాంగులు దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను పూర్తిగా పరిశీలించి, వారికి రుణాలు ఇచ్చే క్రమంలో బ్యాంకుల నుంచి ఎదురవుతున్న ఇబ్బందులను కూడా తమరే విచారించి పరిష్కరించాలని కోరుకుంటున్నాము. ఇప్పటికే ప్రకాశం జిల్లా కలెక్టర్ సూచనల మేరకు జిల్లా బి.సి. కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దివ్యాంగులకు 5% రిజర్వేషన్ అమలుపరచాలని తమరికి ఆదేశాలు ఇచ్చి ఉన్నారు. ఆ ఆదేశాలను పటిష్టంగా అమలుపరచాలని కోరుకుంటున్నాము. అలాగే తమరి దృష్టికి మరొక విషయం తీసుకుని వస్తున్నాము. పొదిలి మండలంలోని తమ పరిధిలో ఉన్న పంచాయితీలు , గ్రామ వార్డు సచివాలయాలలో దివ్యాంగులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తూ వారి కోసం కార్యాలయాలలో ర్యాంపులు, వీల్ చైర్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుకుంటూ జాతీయ దివ్యాంగుల హక్కుల చట్టం 2016ను అమలు పరచాలని కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో సయ్యద్. సుభాని, మందుల. కృష్ణ, సయ్యద్, ఆరిఫార్, మస్తాన్ భాష, తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

# హెచ్ఐవి, ఎయిడ్స్ పై అవగాహన

(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, మే 29)

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ సంస్థ వారు కళాజాత బృందాల ద్వారా గురువారం మాచర్ల పట్టణంలోని బస్టాండ్, రింగురోడ్డు సెంటర్లో హెచ్ ఐవి, ఎయిడ్స్ పై పాటలు,నాటికల ద్వార అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభ కల్చరల్ ఆర్గనైజేషన్ కళాజాత బృందం జానపద కళారూపాల ద్వార హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా రాదు, హెచ్ఐవి, ఎయిడ్స్ రాకుండా ఎటువంటి జాగ్రతలు తీసుకోవాలి, హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్న చూపు లేకుండా ఎలాగా సమాజంలో కలిసి జీవించాలి, హెచ్ఐవి, ఎయిడ్స్- క్షయ వ్యాధి సంబంధం గురించి, హెచ్ఐవి ఉన్న గర్భిణి నుంచి బిడ్డకు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి, సుఖవ్యాధులు మరియూ చికిత్స గురించి, కండోమ్ యొక్క ఉపయోగం గురించి, హెచ్ఐవి, ఎయిడ్స్ యాక్ట్ 2017 గురించి ప్రజలలో విస్తృతంగా అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. అంతేకాకుండా హెచ్ఐవి పరీక్ష అన్ని ప్రభుత్వ వైద్యశాలలో ఉచితంగా చేస్తారని, హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధి ఉన్నవారు ఏఆర్టి కేంద్రాల ద్వారా ఇచ్చే మందులు క్రమం తప్పకుండా వాడినట్లయితే జీవిత కాలాన్ని పెంచుకోవచ్చని అంతేకాకుండా క్రమం తప్పకుండా సిడి4, వైరల్ లోడ్ పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. సందేహాల నివృత్తి కొరకు టోల్ ఫ్రీ నెంబర్ 1097 కు ఫోన్ చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని దాచేపల్లి రీడ్స్ టిఐ సిబ్బంది, పిడి గౌస్, పిఎం కోమలి, ఏఎన్ఎం యలమందమ్మ, ఓఆర్డబ్ల్యూ మౌలాబి, పిఇ మస్తాన్ బి, ఆషా, కీర్తి, కళాజాత బృందం సభ్యులు వీర్నాల మల్లిఖార్జునరావు, వెంకటలక్ష్మి, మిర్యాల మలయ్య, బి కనకరావు, బి ప్రభావతి, వి శాంతి, తదితరులు పాల్గొన్నారు.




# ఎమ్మెల్యే కందుల ఆదేశాల మేరకు మహానాడుకు బయలుదేరిన టీడీపీ నాయకులు







(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 29)

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సూచనల మేరకు కడపలో మూడు రోజులుగా జరుగుతున్న మహానాడు కార్యక్రమానికి మూడో రోజు గురువారం పొదిలి మండలం, పట్టణం నుంచి పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు వాహనాల్లో తరలివెళ్ళారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ స్వర్ణ గీత, మండల పార్టీ అధ్యక్షులు మీగడ ఓబుల్‌రెడ్డి, మాజీ సర్పంచ్, 18వ వార్డ్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కాటూరి నారాయణరావు, పొదిలి మండల తెలుగు యువత అధ్యక్షులు పోపూరి నరేష్ బాబు, కాటూరి వెంకట్రావు, షేక్ ఖాసీం, కంచర్ల 18వ వార్డ్ జనరల్ సెక్రటరీ సెక్రటరీ శ్రీను, చెన్నారెడ్డి వెంకటేష్, కొల్లా నరేంద్ర, రావిపాటి ఆంజనేయులు, రావిపాటి అశోక్, గిద్దలూరు శ్రీకాంత్, కాటూరి అంజి, రమేష్‌బాబు, తెలుగుదేశం నాయకులు బయలుదేరి వెళ్లారు.



# ఘనంగా అహల్యా బాయ్ హెూల్కర్ జయంతి




(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మే 29)

పూజ్యశ్రీ పుణ్య శ్లోక అహల్యా బాయ్ హెూల్కర్ 300 శత జయంతి ఉత్సవలలో కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ జె. రమాదేవి మాట్లాడుతూ రాణీ అహల్యాబాయి ఇండోర్, మహేశ్వర్ ప్రాంతాల్లో అనేక హిందూ ఆలయాలను నిర్మించి ప్రసిద్ధికెక్కింది. ఆమె రాజ్యాలకు ఆవల ఉన్న అనేక పవిత్ర స్థలాల్లో ధర్మశాలలు నిర్మించారు. వాటిలో తూర్పున ద్వారక (గుజరాత్) నుంచి మొదలుకుని వారణాసి, ఉజ్జయిని, నాసిక్, గయ, వైద్యనాథ్ ఆలయం (మహారాష్ట్ర) వంటి ప్రాంతాల్లో ధర్మశాలలు నిర్మాణం చేశారు. సోమనాథ్‌లో పాడుబడి, అపవిత్రమై ఉన్న సుప్రఖ్యాత సోమనాథేశ్వరాలయాన్ని ఆమె పునర్నిర్మించారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్ ఆషా రావు గారు, జిల్లా ప్రధాన కార్యదర్శి నరాల శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు నారాయణ, జిల్లా ప్రధాన అధికార ప్రతినిధి వెంకట్, మండల ప్రధాన కార్యదర్శి నవీన్ జిల్లా నాయకులు గొమ్స్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యాక్సిన్‌లు ఆన్‌లైన్‌లో చేర్చాలి



(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, మే 29)

మండలంలోని పెట్లూరు ప్రాథమిక హాస్పిటల్లో డీవీఎం డిస్టిక్ వాక్సిన్ మేనేజర్ డానియేలు ఆధ్వర్యంలో పి.హెచ్.ఎస్.సి హాస్పిటల్ పరిధిలోని ఏఎన్ఎం లకి 2019 నుండి 2025 జూన్ వరకు గర్భిణులు ,బాలింతలు పిల్లలకు చేసిన వ్యాక్సిన్లు ఆన్‌లైన్‌లో చేర్చాలని ట్రైనింగ్ క్లాస్ నిర్వహించారు



ఎవరైనా గర్భవతులు పిల్లలు ఉంటే వాళ్లను గుర్తించి వ్యాక్సిన్లు వేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా డిస్టిక్ వాక్సిన్ మేనేజర్ దానియేలు అన్నారు. ఈ ట్రైనింగ్ క్లాసులో పెట్లూరు పీహెచ్సీ హాస్పటల్ సిబ్బంది ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

# రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, మే 29)



ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్1 నుంచి రేషన్స్ డిలర్లు తమ దుకాణాల వద్ద కార్డుదారులకు సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని మండల తహసీల్దార్ సైలెందర్ కుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల పరిధిలోని రేషన్ డీలర్లతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం వచ్చే నెల ఒకటి నుంచి రేషన్ సరుకులు అందించే ఎండీయూ వాహనాలను రద్దు చేసిన నేపథ్యంలో రేషన్ డీలర్ల తమ చౌక దుకాణాల వద్దనే కార్డుదారులకు సరుకులు అందించాలని సూచించారు. ప్రతి నెల ఒక్కటోవ తేది నుంచి 15 వరకు ఉదయం 8: గం నుంచి మధ్యాహ్నం 12: గం వరకు సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గం వరకు అందించాలని సూచించారు. పాత పద్ధతిలో సకాలంలో డీడీలు చెలించి రేషన్ సరుకులు దుకాణాలకు చేర్చు కోవాలి అన్నారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన రేషన్ సరుకులు నేరుగా ఎంఏల్ ఎస్ పాయింట్ల ద్వారా చేరుతాయి అన్ని చెప్పారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ప్రతి రేషన్ దుకాణం వద్ద స్టాక్ బోర్డ్ ధరల పట్టిక వివరాల పట్టిక ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఆర్ఐ గోపి, డీలర్స్ పాల్గొన్నారు.

## మహానాడులో పాల్గొన్న అలగాయపాలెం టిడిపి నాయకులు కోమట్ల



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 29)
కడపలో గురువారం మూడోరోజున నిర్వహించిన మహానాడు వేడుకల్లో ఉలవపాడు మండలం కరేడు పంచాయతీ అలగాయపాలెం రెడ్డిపాలెంకు చెందిన టిడిపి నాయకులు కోమట్ల వెంకటరామిరెడ్డి, పెల్లేటి



వెంకటరామిరెడ్డి, గుమ్మడి శీను, పొడ మేకల సుబ్రహ్మణ్యం, వాయల వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

## యోగ మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత





(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మే 29)
స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం యోగేంద్ర కార్యక్రమం మూడో రోజు ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యోగా సాధన చేయటం వల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయని శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా యోగ మనకు మేలు చేస్తుందని పరిశోధనలు చెబుతున్నాయి. యోగ ఆసనాలు చేయటం వల్ల కండరాల బలంగా మారుతాయి శరీరానికి వశ్యత పెరుగుతుందని మరియు సమతుల్యత కూడా మెరుగుపడుతుందని, రోగనిరోధక శక్తిని పెంచుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ శ్రీదేవి శిక్షణ తీసుకునే ఆయా శాఖ అధికారులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

## మహానాడుకు బయలుదేరిన మండల టిడిపి నాయకులు





(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మే 29)
కడప జిల్లాలో జరిగే మహానాడుకు మూడవరోజు గురువారం మండల పరిధిలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి పిలుపుమేరకు మహానాడుకు భారీగా తరలి వెళ్లారు.

# బౌద్ధ ధర్మం, సంస్కృతి ఆచార్య నాగార్జునుడితో పునర్జీవం

## జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, మే 29)
బౌద్ధ ధర్మం, సంస్కృతి ఆచార్య నాగార్జునుడుతో పునర్జీవం పోసుకుంటూ విరాజిల్లడం అభిలాషణీయమని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అన్నారు. ఆచార్య నాగార్జునుడి జన్మస్థలమైన బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం యాజలి గ్రామంలో ఫోరం ఫర్ బెటర్ బాపట్ల సంస్థ ఏర్పాటు చేసిన ఆచార్య నాగార్జునుడి విగ్రహాన్ని కలెక్టర్ గురువారం ఆవిష్కరించారు. ఆచార్య నాగార్జునుడి శూన్య వాదంతో భారత్ ఐన్‌స్టెన్‌గా చరిత్రలో నిలిచిపోయారని కలెక్టర్ తెలిపారు. భారత దేశంలో రెండవ బుద్ధుడుగా ప్రాచుర్యం పొందారని, స్నుహలేఖ, రత్నావళి వంటి కావ్యాలను రాసిన గొప్ప వ్యక్తిగా అభివర్ణించారు. ప్రపంచ తత్వవేత్తగా ఎదిగి సమాజానికి మార్గ నిర్దేశించేశారని వివరించారు. నాగార్జునుడు రెండు వేల సంవత్సరాల క్రితం ఈ ప్రాంతంలోనే జన్మించారని చరిత్రను గుర్తు చేశారు. బుద్ధుడు, నాగార్జునుడు నడిచిన భూమిలో పర్యటించడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. నాగార్జునుడి కావ్యాలను శాతవాహన చక్రవర్తి ప్రాచూర్యంలోకి తెచ్చారన్నారు. ఆనాటి సంస్కృతిని, సంప్రదాయాలను ప్రజలు విస్మరించరాదన్నారు. నాగార్జునుడి పేరుతోనే నాగార్జునసాగర్ డ్యాంని కేంద్ర ప్రభుత్వం నిర్మించిందన్నారు. ఆనాటి తవ్వకాలలో నాగార్జునుడి వస్తువులు వెలుగులోకి రావడంతో మ్యూజియం ఏర్పాటైందన్నారు. ఆయన పేరుతోనే ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఆయన గొప్ప చరిత్రకారుడు అని కొనియాడారు. బుద్ధుడి బోధనలను క్షేత్రస్థాయిలోకి తీసుకొని వెళ్ళిన గొప్ప మేధావిగా ఆయన అభివర్ణించారు. బుద్ధుడి బోధనలు సదా ఆచరణీయమన్నారు. ఆయన జన్మించిన గ్రామాల్లోని ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం గ్రామస్తులకు గొప్ప భాగ్యమన్నారు. ఆయనను స్మరించుకోవడం శుభ పరిణామం అని ఆయన అన్నారు. ఫోరమ్ ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్డీవో లవన్న, డిపిఓ ప్రభాకర్ రావు, ఎంపీడీవో ఏ శ్రీనివాసరావు, తహసిల్దార్ సుందరమ్మ, ఎంఈఓ విజయశ్రీ, కార్యదర్శి డాక్టర్ పిసి సాయిబాబు, సభ్యులు జీవి గురజాల శ్రీనివాసరావు, కె.నరసింహారావు, కరణం రవీంద్ర, లక్కాకుల వెంకటరావు, కేశవులు, సూరిబాబుతోపాటు గ్రామ సర్పంచ్ నాదెండ్ల భాను ప్రసాద్, ఉపసర్పంచ్ ఇక్కుర్తి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.








# కడప అమీన్‌పీర్ దర్గాను సందర్శించిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మే 29)
ప్రసిద్ధి గాంచిన కడప నగరంలోని అమీన్ పీర్(పెద్దదర్గా)ను ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సందర్శించారు. గురువారం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, డీసీసీబీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి ఆయన దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత అయనకు దర్గా నిర్వాహకులు ముస్లిం సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. దర్గా చారిత్రక, సాంస్కృతిక విశిష్టతను వివరించారు. అనంతరం దర్గా సాంప్రదాయం పాటిస్తూ జీవీ ఆంజనేయులు, మక్కెనకు తలపాగా చుట్టి సత్కరించారు. అనంతరం పెద్ద దర్గాలోని హజరత్ పీరుల్లామాలిక్ సాహెబ్ మజార్‌ను దర్శించుకుని చాదర్ సమర్పించి దర్గా పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేనీ ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ పెద్దదర్గాను సందర్శించడం ఎంతో సంతోషం కలిగించిందన్నారు. అక్కడి ప్రశాంత, ఆధ్యాత్మిక వాతావరణం తనను ఎంతో ఆకట్టుకుందన్నారు కడపలో తొలిసారి నిర్వహించిన తెలుగుదేశం పార్టీ మహానాడు కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతం కావడం పట్ల చాలా ఆనందం గా ఉందన్నారు. రాష్ట్రం మొత్తం సుభిక్షంగా ఉండాలని, చంద్రబాబు సారథ్యంలో అన్నిప్రాంతాలు సర్వతోముఖాభివృద్ధిక చెందాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ పవిత్ర స్థలం ఐక్యతకు, సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని, రాష్ట్ర ప్రజలందరూ శాంతి, సౌభ్రాతృత్వంతో జీవించాలని ప్రార్థించారన్నారు.







# విశ్వకర్మ పథకం పనిముట్లు అందజేత

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, మే 29)
మార్కాపురం హెడ్ పోస్ట్ ఆఫీస్‌లో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో బీసీల అభివృద్ధికి ప్రవేశపెట్టిన విశ్వకర్మ పథకం కింద ట్రైనింగ్ పూర్తి చేసిన లబ్ధిదారులకు పోస్ట్ ఆఫీస్ ద్వారా వచ్చిన డ్రిల్లింగ్ మిషన్లు , కోత మిషన్లు ,కటింగ్ మిషన్లు పనిముట్లను హెడ్ పోస్ట్ మాస్టర్ ఇందిరా, ఇండియన్ పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు మేనేజర్ సాయిరాం ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి పీవీ కృష్ణారావు, జాతీయ కౌన్సిల్ మెంబర్ శాసనాల సరోజిని అసెంబ్లీ కో కన్వీనర్ దేవిశెట్టి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com